సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం ‌। 4 ‌। డిసెంబర్ ‌। 2023



‘మిచాంగ్’తో కలవరం

మిచాంగ్ తుపాను హెచ్చరికలతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను సమయంలో పాటించాల్సిన ముందస్తు జాగ్రత్తలను అధికారులు సూచించారు. 10లో



బీసీలకు పెద్దపీట

వైఎస్ జగన్ బీసీలకు పెద్దపీట వేశారని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకులో శెట్టిబలిజల కార్తీక వనసమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. 10లో



వరి రైతులకు జాగ్రత్తలు

మిచాంగ్ హెచ్చరికతో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పంట నష్టాన్ని నివారించుకోవాలని సూచిస్తున్నారు. వరి పంటని వర్షాలకు ముందు కోయకూడదన్నారు. 10లో

మిచాంగ్‌పై హై అలర్ట్

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- రైతులకు అండగా పలు ప్రాంతాల్లో కలెక్టర్ సుడిగాలి పర్యటన
- ధాన్యం సేకరణకు సడలింపులు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు

సాక్షి, భీమవరం: మిచాంగ్ తీవ్ర తుఫాన్‌గా బలపడటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రైతులతో పాటు సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సహాయక చర్యల్లో నిమగ్నమైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సుడిగాలి పర్యటన చేసిన కలెక్టర్, జేసీలు కల్లాల్లోని ధాన్యం తరలింపునకు చర్యలు చేపట్టడంతో పాటు తీరప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో 2.1 లక్షల ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేశారు. 90 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. తాడేపల్లిగూడెం మండలంలో 95 శాతం కోతలు పూర్తి కాగా, తణుకులో 70 శాతం, పెంటపాడులో 85 శాతం, గణపవరంలో 50 శాతం, మిగిలిన మండలాల్లో 20 శాతం మేర పూర్తయ్యాయి. ఇంతవరకు వరికోతలు పూర్తయిన మేర 1.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన 314 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 1.02 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా.. దాదాపు 46 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించినట్టు అంచనా. ఇంకా రైతులు వద్ద 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తుఫాన్ నేపథ్యంలో ఏ ఒక్క ధాన్యం గింజ తడవకూడదన్న లక్ష్యంతో కలెక్టర్ పి.ప్రశాంతి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఆదివారం పాలకొల్లు మండలంలోని శివదేవుని చిక్కాల, బల్లిపాడు, దగ్గులూరు, తిల్లంపూడి, పలివెల, లంకలకోడేరు గ్రామాల్లో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. రైతుల వద్దకు వెళ్లి కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని ఆర్‌బీకేలకు తరలించి సత్వర కొనుగోలుకు చర్యలు చేపట్టారు. రానున్న 24 గంటల్లో తీవ్ర వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున త్వరితగతిన ఆర్‌బీకేలకు తరలించుకోవడం, తడవకుండా జాగ్రత్త పరచడం చేయాలని రైతులకు సూచించారు. సచివాలయ, మండల, డివిజన్ స్థాయి అధికారులు తమ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలిచ్చారు. వ్యవసాయ, సివిల్ సప్లయిస్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం సేకరణపై సమీక్షించారు.



కల్లంలో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి



రైతులతో మాట్లాడుతున్న జేసీ రామసుందర్ రెడ్డి

రాత్రి సమయంలో సైతం రైతులకు అందుబాటులో ఉండి ధాన్యం సేకరణలో రైతులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. సకాలంలో రవాణ చేయకపోవడం వలన తమ ధాన్యం తడిసిపోయిందని ఏ ఒక్క రైతు నుంచి ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు.

ధాన్యం సేకరణకు సడలింపులు

తుఫాన్ నేపథ్యంలో ఏ ఒక్క రైతు నష్టపోకూడదన్న ఉద్దేశంతో ధాన్యం సేకరణలో ప్రభుత్వం పలు సడలింపులనిచ్చింది. ధాన్యాన్ని నచ్చిన మిల్లుకు తరలించుకునే వీలు కల్పించింది. సొంత వాహనాలకు జీపీఎస్ లేకపోయిన వినియోగించుకునే అవకాశంతో పాటు ఆఫ్‌లైన్ ద్వారా ధాన్యం సేకరణకు వెసులుబాటు కల్పించినట్టు జేసీ రామసుందర్‌రెడ్డి తెలిపారు. పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. వదంతులు నమ్మకుండా అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని రైతులు, ప్రజలకు సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో మకాం వేసి రైతులకు ఏ ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఇంకా వరికోతలు కోతలు కోయాల్సిన రైతులు మరో నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని తెలిపారు.

ఆ మండలాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు, ఆచంట, యలమంచిలి మండలాల్లో తుఫాన్ తీవ్రత అధికంగా ఉంటుందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో ఆయా మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పూర్తి స్థాయిలో అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండేలా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించారు. వైద్యాధికారుల సూచనల మేరకు గర్భిణులను సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించే ఏర్పాట్లు చేశారు. అలల తాకిడి ఎక్కువగా ఉన్నందున తీర ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా సముద్ర ప్రాంతానికి చేరుకునే మార్గాల్లో పోలీసులు, అధికారులు నిఘా ఉంచారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం ద్వారా మిచాంగ్ తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోనేందుకు అధికారయంత్రాంగం సన్నద్ధంగా ఉంది.

కంట్రోల్ రూం విధులు కీలకం



కంట్రోల్ రూం పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): తుఫాన్ సమయంలో కంట్రోల్ రూమ్ విధులు ఎంతో కీలకమైనవని, అత్యవసర సమాచారాన్ని సంబంధిత అధికారులకు వెంటనే చేరవేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పశ్చిమ గోదావరి కలెక్టరేట్‌లో ‘మిచాంగ్’ తుఫాన్ కంట్రోల్ రూంను కలెక్టర్ ఆదివారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. తుఫాన్ అత్యవసర సాయం కోసం కంట్రోల్ రూమ్ నెంబర్ 08816 299219ను జిల్లా ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. కంట్రోల్ రూం సిబ్బందితో మాట్లాడుతూ తుపాను తీరం దాటే వరకు వర్షాలు, పెద్ద ఎత్తున గాలులు వీచే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి సమయంలో సాయం అవసరమైన ప్రజలు కంట్రోల్ రూంకు ఫోన్ చేసి సాయాన్ని కోరతారని, వారి వివరాలు శ్రద్ధగా విని రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. అనంతరం సంబంధిత అధికారులకు వెంటనే వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. తుఫాన్ తీరం దాటే వరకు విధులు అప్రమత్తంగా నిర్వహించాలని సూచించారు.

లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుఫాన్ బలపడుతున్నందున లోతట్టు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. నరసాపురం, మొగల్తూరు, ఆచంట, యలమంచిలి మండలాలు ఎక్కువగా తుఫాన్ తాకిడికి గురై అవకాశం ఉందన్నారు. ఆయా మండలాల ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ధాన్యం రైతు భరోసా కేంద్రాలకు తరలించాలని, కోసి ఉంచిన ధాన్యం తడవకుండా జాగ్రత్త పరుచుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

నెలాఖరుకు రీ సర్వే పూర్తవ్వాలి



డేటా సెంటర్ పరిశీలిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్) : ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కంప్యూటరు డేటా సెంటర్‌ను జాయింటు కలెక్టరు ఎస్.రామసుందర్ రెడ్డి పరిశీలించారు. మూడో విడత రీ సర్వే ఫైనల్ రికార్డులను, కంప్యూటరు డేటాను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడో విడత రీ సర్వే ఫైనల్ రికార్డ్స్, కంప్యూటరు డేటా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. మూడో విడత రీ సర్వే పనులు డిసెంబరు 31 నాటికి పూర్తి చేయాలని సర్వే అధికారిని జాయింటు కలెక్టరు ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో సర్వే అధికారి కె.జాషువా, ఆకివీడు మండలం ల్యాండు సర్వే అధికారి నడింపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి స్పందన రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): బంగాళాఖాతంలో వాయుగుండం తీవ్ర తుఫాన్‌గా బలపడినందున సోమవారం జరగాల్సిన జిల్లా స్థాయి స్పందన రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తుఫాను హెచ్చరికలను పాటిస్తూ ఇంటి వద్దనే ఉండాలని, జిల్లా కేంద్రానికి రేపు ఎవరు రావద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

భీమవరం : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్వీ రమణ తెలిపారు. జిల్లాలో 2,921 మంది విద్యార్థులకు 2,810 విద్యార్థులు హాజరు కాగా 111 మంది గైర్హాజరయ్యారన్నారు. 13 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీ చేయగా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

స్వామివారికి ప్రత్యేక అలంకరణ



భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలో వేంచేసియున్న పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానంలో కార్తీకమాసోత్సవంలో భాగంగా ఆదివారం మొత్తం రూ.2,28,466 ఆదాయం రాగా, 618 లడ్డులు విక్రయించామని ఈఓ డి.కృష్ణంరాజు తెలిపారు. స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించామన్నారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారన్నారు.

మంగమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు



బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రైవేటు బస్సులు, మినీ వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండలంలోని మర్లగూడెం అటవీప్రాంతంలో కొలువై ఉన్న పాటిమ్మ తల్లి, దుర్గమ్మ తల్లిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏనుగు తోగు జలపాతం, ఉప్పరెల్ల సమీపంలోని జలపాతాల వద్ద సందర్శకులు సందడి చేశారు.

ధాన్యాన్ని ఏ మిల్లుకైనా తరలించవచ్చు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మాసూళ్లు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం అత్తిలి మండలం వరిఘేడు, తిరుపతిపురం, బల్లిపాడులో మంత్రి కారుమూరి పర్యటించి రైతులతో మాట్లాడారు. వాతావరణ మార్పులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో దగ్గరలో ఉన్న ఏ రైస్‌మిల్లుకైనా తరలించుకునే సదుపాయం కల్పించామన్నారు. రైతులు మిల్లర్ల దగ్గరకు వెళ్లాల్సిన పనిలేదన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద ఆన్‌లైన్‌లో కూడా రైతులు తమ పంట నమోదు చేసుకుని నిర్దేశించిన రైస్‌మిల్లుకు ధాన్యాన్ని తరలించుకోవచ్చని చెప్పారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మిల్లర్లు కూడా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో గోనెసంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఏ ఇబ్బంది లేకుండా అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏమిల్లరైనా ఇబ్బంది పెడితే తనకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. భారీ వరి కోతలు కొన్నిరోజులు పాటు వాయిదా వేసుకోవాలని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రైతులకు సూచించారు. మంత్రి వెంట సివిల్ సప్లయిస్ డీఎం శివరామ ప్రసాద్, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ ఉన్నారు.



అత్తిలి మండలం వరిఘేడులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

రైతులు కోసిన ధాన్యాన్ని తక్షణమే రైతు భరోసా కేంద్రాలకు తరలించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్‌సుందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం అత్తిలి మండలం మంచిలి, స్కిన్నెరపురం, కంచుమర్రులో ఆరబోసిన ధాన్యాన్ని జేసీ పరిశీలించి మాట్లాడారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున వరికోతలు నాలుగు రోజుల పాటు వాయిదా వేసుకోవాలన్నారు. మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కమిటీలు వేశామని, క్షేత్రస్థాయిలో అధికారులు ఉండి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండి పరిశీలన చేసుకోవాలన్నారు. ధాన్యాన్ని ఆరుబయట కాకుండా సురక్షిత ప్రాంతాలలో ఆరబెట్టుకుని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని చెప్పారు.

18 ఏళ్లు నిండితే ఓటు హక్కు కల్పించాలి

పాలకొల్లు అర్బన్: ఓటరు జాబితాలో మరణించిన వారి ఓట్లు లేకుండా చూడాలని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశాలిచ్చారు. పాలకొల్లు మండలం బల్లిపాడు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్ఓల రిజిస్టర్‌లు, క్లెయిమ్‌లు దరఖాస్తులను తనిఖీ చేశారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులను, స్లిప్పులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చి, లేదా మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని, పంచనామా చేసి ఓటు తొలగించాలన్నారు. డోర్ టు డోర్ సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని, బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. ఒకే డోర్ నెంబరులో 10 కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్నా, సున్నా లేక తప్పుడు డోర్ నెంబర్లతో ఓట్లు ఉన్నా వాటిని సరి చేయాలన్నారు. బీఎల్ఓ సూపర్‌వైజర్ విధుల్లో లేకపోవడంతో షోకాస్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. ఆమె వెంట జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు తదితరులున్నారు.



పాలకొల్లు మండలం బల్లిపాడులో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలన

ఏలూరు(మెట్రో): ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. శనివారం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా, మండల అధికారులు సందర్శించి నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. పోలవరం నియోజకవర్గంలోని ఎల్ఎన్‌డీ పేట, ప్రగడపల్లి, నూతన్నగూడెం గ్రామాల్లోని పలు కేంద్రాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో ఎం.సూర్య తేజ పరిశీలించారు. లింగపాలెం మండలం యడవల్లిలో సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్ పరిశీలించారు. ద్వారకతిరుమల మండలం పంగిడిగూడెంలో పశు సంవర్ధకశాఖ శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూ బాబు పరిశీలించారు.

హద్దుల కోసమే లైడార్ సర్వే

- కొల్లేరు కాంటూర్ల సర్వేపై కొందరి దుష్ప్రచారం
- ఎకో సెన్సిటివ్ బఫర్ జోన్‌పై అపోహలొద్దు

కైకలూరు: ప్రశాంతతకు మారుపేరైన కొల్లేరు గ్రామాల్లో స్వార్థ రాజకీయ శక్తులు చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. కొల్లేరు వాస్తవ కాంటూరు సరిహద్దుల నిర్ణయం కోసం అత్యాధునిక సాంకేతికతతో హెలికాప్టర్ ద్వారా చేపడుతున్న లైడార్ సర్వేపై విషం చిమ్ముతున్నాయి. కొల్లేరు చరిత్రలో కాంటూరు హద్దులను ఖచ్చితంగా నిర్ణయించిన ప్రభుత్వాలు లేవు. కొల్లేరులో పదో కాంటూరు వరకు ఖచ్చిత సరిహద్దులు గుర్తిస్తే ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిని ఎక్కడి వరకు కుదించాలనే విషయం తెలుస్తుంది. కొల్లేరు కాంటూరు కుదింపు అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నప్పటికీ.. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై బురద చల్లడానికి ప్రయత్నిస్తున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఏలూరు, కైకలూరు, దెందులూరు, ఉంగుటూరు, ఉండి నియోజకవర్గాల్లోని తొమ్మిది మండలాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. మొత్తం 122 కొల్లేరు అనుబంధ గ్రామాల్లో 3.2 లక్షల జనాభా నివసిస్తున్నారు. జీవో నెంబర్ 120 ప్రకారం ఐదో కాంటూరు వరకు 77,138 ఎకరాలను కొల్లేరు అభయారణ్యంగా గుర్తించారు. ఇక్కడి ప్రజలు కొల్లేరును ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదించి మిగిలిన భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు గత టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి నివేదించాయి. ఎన్నికలు దగ్గరపడితే కొల్లేరు కాంటూరు అంశం లేవనెత్తడం ఇక్కడి రాజకీయ నాయకులకు పరిపాటిగా మారింది.





ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో లైడార్ సర్వే కోసం హెలికాప్టర్ వద్ద సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు, కొల్లేరు గ్రామాల్లో క్షేత్ర స్థాయి సర్వే చేస్తున్న సిబ్బంది

ఎకో సెన్సిటివ్ జోన్‌పై అపోహలు

సున్నిత పర్యావరణ ప్రాంతం (ఎకో సెన్సిటివ్ జోన్) అంశంపై ప్రజల్లో కొందరు అపోహలు సృష్టిస్తున్నారు. ఎకో సెన్సిటివ్ జోన్‌ను కొల్లేరుకు వర్తింప చేయాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. దీని ప్రకారం కొల్లేరు సరిహద్దు నుంచి 10 కిలోమీటర్ల పరిధిని బఫర్ జోన్‌గా పరిగణిస్తారు. వాస్తవానికి ఇది ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా బఫర్ జోన్ పరిధిని తగ్గించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే అటవీ శాఖ కొల్లేరు గ్రామాల్లో ప్రజల అభిప్రాయాలను సేకరించింది. కొల్లేరు సమస్య ఏర్పడిన తర్వాత 24 సంవత్సరాలుగా కొల్లేరు గ్రామాల్లో సరైన సర్వే వివరాలు లేవు. లైడార్ సర్వే ద్వారా కచ్చితమైన కాంటూరు విస్తీర్ణం లెక్కలోకి వస్తుంది. 10వ కాంటూరు వరకు లెక్క తేలనుంది. ఈ సర్వేతో ప్లస్ 5 కాంటూరు వరకు భూమి ఎంత ఉంది.. పెరిగిందా.. తగ్గిందా.. పదో కాంటూరు వరకు ఎంత విస్తీర్ణం ఉంది.. సరిహద్దుల్లో ఏమైనా తేడాలున్నాయా? అనే విషయాలు తెలుస్తాయి. సరిహద్దు లెక్కలు పక్కాగా తెలిసిన తర్వాత ఎకో సెన్సిటివ్ జోన్‌ను ప్రజల అభిప్రాయంతో 500 మీటర్లకు కూడా కుదించుకునే అవకాశం ఉంటుంది.


రూ.3.29 కోట్లతో లైడార్ సర్వే

కొల్లేరులో 10వ కాంటూరు వరకు ఉన్న భూమిని గుర్తించడానికి లైడార్ సర్వే నిమిత్తం అటవీ శాఖ కంపా నిధులు రూ.3.29 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఆర్‌వీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులను చేపడుతోంది. ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణ బాధ్యతలు చేపడుతున్నారు. క్షేత్ర స్థాయిలో గ్రౌండ్ వర్క్‌లో భాగంగా ఆరు బెంచ్ మార్కుల కోసం బేస్ స్టేషన్లను మండవల్లి, గుండుగొలను, నారాయణపురం, చినకాపవరం, నందివాడ, ఏలూరులో ఏర్పాటు చేశారు. పెదపాడు, ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, కైకలూరు, మండవల్లి, ఆకివీడు మండలాల్లో లైడార్ సర్వే చేస్తున్నారు. లైడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజ్) లేజర్‌తో ఉపరితలాన్ని లక్ష్యంగా చేసుకుని ఖచ్చితమైన కొలతలతో విస్తీర్ణాన్ని అందిస్తుంది. మరో 15 రోజుల్లో లైడార్ సర్వే పూర్తి కానుంది. ఇటీవల పోలవరం నిర్వాసిత ప్రాంతాలపై ఈ టెక్నాలజీని వినియోగించారు.

కొల్లేరు ప్రజలకు అండగా..

కొల్లేరులో ఓట్ల కోసం ఇప్పటి నుంచి రాజకీయ నేతలు పాట్లు పడుతున్నారు. వాస్తవానికి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొల్లేరు గ్రామాల్లో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరిగాయి. పలు గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు ఏర్పడ్డాయి. ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పథకాలు కొల్లేరు ప్రజలకు అండగా నిలిచాయి. ముఖ్యంగా కొల్లేరు ప్రాంతానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణకు సీఎం జగన్ ఎమ్మెల్సీ కేటాయించి అక్కున చేర్చుకున్నారు. కొల్లేరు గ్రామాల్లో మార్పును తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు.

కొల్లేరు ప్రజలకు అన్యాయం జరగదు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో కొల్లేరును రీసర్వే చేయిస్తానని మాట ఇచ్చారు. లైడార్ సర్వే జరిగితే కాంటూరు హద్దుల లెక్క తేలుతుంది. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిని 500 మీటర్లకు నిర్ణయించాలని ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాను. పర్యావరణం, ప్రజలు రెండూ ముఖ్యమని చెప్పాను. సీఎం జగన్ కొల్లేరు ప్రజల పట్ల ఎంతో సానుకూలంగా ఉన్నారు. కొల్లేరు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కొందరు ప్రయతిస్తున్నారు. వారి మాటలు నమ్మొద్దు.

– జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్సీ, కైకలూరు

అపోహలు నమ్మొద్దు



ఎకో సెన్సిటివ్ జోన్ పరిధి గుర్తింపుపై పలువురు అపోహలు సృష్టిస్తున్నారు. కొల్లేరు ప్రజలు వీటిని నమ్మొద్దు. ఇది కొల్లేరు ప్లస్ 5 కాంటూరు వాస్తవ ఉనికి కోసం సర్వే జరుగుతోంది. కొల్లేరు గ్రామాల్లో సర్వే నెంబర్లలో విస్తీర్ణంపై అనేక మందికి అనుమానాలున్నాయి. ప్రజల అనుమానాలను నివృత్తి చేయడానికి లైడార్ సర్వే జరుగుతోంది. కాంటూరు హద్దులు తేలిన తర్వాత బఫర్ జోన్ ఎంత వరకు ఉండాలనేది ప్రజల అభిప్రాయాలపై ఆధారపడి ఉంటుంది.

– రవిశంకర్, జిల్లా అటవీ శాఖ అధికారి, ఏలూరు

రైతుల్లో ‘మిచాంగ్’ కలవరం

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు

కైకలూరు: మిచాంగ్ తుపాను హెచ్చరికలతో ఆక్వా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించడంతో ఆక్వా చెరువులను ఎలా కాపాడుకోవాలనే సందిగ్ధంలో రైతులు పడ్డారు. వాతావరణంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చేపలు, రొయ్యలు ఆక్సిజన్ అందక ఒత్తిడికి గురై మరణించే అవకాశాలు ఉంటాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 2.60 లక్షల ఎకరాల్లో చేపలు, రొయ్యల సాగు జరుగుతోంది. తుపాను సమయంలో ఆక్వా రైతులు పాటించాల్సిన ముందస్తు జాగ్రత్తలను కైకలూరు ప్రభుత్వ ఆక్వా ల్యాబ్ ఏడీ బి.రాజ్‌కుమార్ ఆదివారం సూచించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

చేపలు లేదా రొయ్యలు పట్టుబడి చేయరాదు. మేతలు బాగా తగ్గించి వేయాలి. ఎరువులు లేదా రసాయన మందులు చెరువులలో చల్లరాదు. విద్యుత్ సరఫరా లేకపోతే డీజిల్ ఆయిల్ సరిపడా సిద్ధం చేసుకోవాలి. బలహీనంగా ఉన్న చెరువు గట్లను ఇసుక బస్తాలతో పటిష్ట పర్చుకోవాలి. – అధిక వర్షపాతానికి చెరువులు పొంగే అవకాశం వున్నందున కొంత నీటిని ముందుగానే బయటకు తీసుకోవాలి. మబ్బులు, వర్షం కారణంగా ప్రాణవాయువు స్థాయి తగ్గే అవకాశం ఉన్నందున పొటాషియం పర్మాంగనేట్, కాల్షియం ఫెరాక్సైడ్, ఆక్సిజన్ బిళ్లలను సిద్ధంగా ఉంచుకోవాలి. పీతల చెరువులకు, గట్లు ఎత్తు తక్కువ ఉన్న రొయ్యల చెరువులకు 1 మీటరు ఎత్తుతో చెరువు చుట్టూ వలను ఏర్పాటు చేసుకోవాలి. అధిక వర్షపాతం కారణంగా ఉదజని సూచిక తగ్గే అవకాశం వున్నందున వర్షం తగ్గిన వెంటనే 1 ఎకరాకు 50 నుంచి 100 కేజీలు వ్యవసాయ సున్నం వాడుకోవాలి. తల్లి చేపలు చనిపోయే అవకాశం ఉన్నందున పట్టుబడి చేయుటకు ఐస్ సిద్ధంగా పెట్టుకోవాలి. చనిపోయిన చేపలు వెంటనే వేరుచేసి గోతులో సున్నం వేసి కప్పివేయాలి. రొయ్యల చెరువులో వర్షం తగ్గిన వెంటనే చెరువులోని వర్షపు నీటిని బయటకు పంపించాలి. చెరువు గట్లపై విద్యుత్తు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి.



కైకలూరులోని ఓ రొయ్యల చెరువులో ఏరియేటర్స్ తిప్పుతున్న దృశ్యం, కైకలూరు ప్రభుత్వ ఆక్వా ల్యాబ్ ఏడీ బి.రాజ్‌కుమార్ (అంతరచిత్రం)

క్లుప్తంగా

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



మంటలను ఆర్పుతున్న స్థానికులు

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో విద్యుత్ వైర్లు తగలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. రైతు మోహన్ పొలం నుంచి గడ్డిని ట్రాక్టర్ ట్రక్కులో ఆదివారం తరలిస్తుండగా పుంతల ముసలమ్మ గుడి సమీపంలో వచ్చేసరికి 11 కేవీ విద్యుత్ వైర్లకు ట్రాక్టర్ ట్రక్కుపై ఉన్న గడ్డికి తగలడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో గడ్డి పూర్తిగా దగ్ధం కాగా, ట్రాక్టర్ ట్రక్కు పాక్షికంగా దగ్ధమైంది. విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతుండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని రైతులు చెబుతున్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఏలూరు (టూటౌన్): రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా బాపులపాడుకు చెందిన పల్లూరి అనిల్ కుమార్ (29) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 2వ తేదీ రాత్రి నూజివీడు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రగాయాలతో ఉన్న అతన్ని స్థానికులు ఓ ప్రైవేటు వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ అనిల్ కుమార్ ఆదివారం మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శభాష్ వలంటీర్



కాకినాడ ఆసుపత్రిలో భవానికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీవల్లి

పాలకోడేరు: దూరప్రాంతాల్లో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛను సొమ్ము అందజేసి శభాష్ అనిపించుకుంటున్నారు పలువురు వలంటీర్లు. మోగల్లుకు చెందిన కోలా కనకదుర్గ భవాని వికలాంగురాలు. ఆమె ఫిట్స్, మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు జగనన్న ప్రభుత్వం వికలాంగుల పింఛనును మంజూరు చేసింది. ఇటీవల గర్భిణి కాగా, కాన్పు కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరగా అక్కడ ఆమెకు కడుపులో బిడ్డ చనిపోయింది. దీంతో అక్కడే ఆమె చికిత్స పొందుతుండగా, వలంటీర్ మోగంటి లక్ష్మి శ్రీవల్లి విషయం తెలుసుకుని మోగల్లు నుంచి కాకినాడ వెళ్లి భవానికి పింఛను సొమ్ము అందజేసింది. దీంతో ఆమె ఉబ్బితబ్బిబై రెండు చేతులు జోడించి జగనన్నకు కృతజ్ఞతలు తెలిపింది.

అమలాపురం వెళ్లి పింఛను అందజేత

పెనుగొండ: కంటి శస్త్రచికిత్స చేయించుకుని అమలాపురంలో బంధువుల ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లి పింఛను అందజేసి తన ఔదార్యాన్ని చాటుకుంది ఓ వలంటీర్. సిద్ధాంతానికి చెందిన వృద్ధురాలు గుబ్బల శేషారత్నం ఇటీవల అమలాపురంలో కంటికి శస్త్రచికిత్స చేయించుకుంది. అనంతరం అక్కడే బంధువుల ఇంట్లో విశ్రాంతి తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ నూకపెయ్యి ప్రకాష్ ఆదివారం అమలాపురం వెళ్లి శేషారత్నంకు పింఛను సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్, జగనన్నకు ఆమె కృతజ్ఞతలు తెలుపగా, పలువురు అభినందించారు.



అమలాపురంలో పింఛను అందిస్తున్న వలంటీర్ ప్రకాష్‌రాజు

వరి రైతులూ.. ఈ జాగ్రత్తలు పాటిద్దాం

- కోతకు సిద్ధమైన వరి పంటను వర్షాల ముందు కోయవద్దు
- ఇప్పటికే కోత కోస్తే పనలపై ఉప్పు ద్రావణం చల్లుకోవాలి
- తుపాను నేపథ్యంలో రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు

చింతలపూడి: ఖరీఫ్ వరి పంట కోతలు జిల్లాలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మిచాంగ్ తుపాను హెచ్చరికలతో ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అప్రమత్తమైంది. తుపాను వల్ల రైతులకు నష్టం జరక్కుండా ముందుగా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. తుపాను కారణంగా ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వరి రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పంట నష్టాన్ని నివారించుకోవాలని మార్టేరు వరి శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ ద్వారా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్ రైతులకు సూచిస్తున్నారు.

వరి కోతలు ఇప్పుడే వద్దు.. ఒకవేళ కోసినా..

కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటని వర్షాలకు ముందు కోయకూడదన్నారు. ఒకవేళ ముందుగానే కోత పూర్తి చేసి ఉంటే పూర్తిగా ఆరని పనలను కుప్ప వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లాలని సూచిస్తున్నారు. అలాగే కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిచినట్టైతే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలి. ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్ల పైకి తెచ్చి విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి. కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి. నూర్చిన ధాన్యం 2, 3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఒక క్వింటా ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పార బట్టి నిలవ చేసుకోవాలి.

రంగు మారి, తడిచిన ధాన్యాన్ని ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని తగ్గించుకోవచ్చు. పిగులు పొట్ట మరియు పూత దశలో పైరు రోజుల కన్నా ఎక్కువ రోజులు నీట మునిగి ఉంటే కంకి పూర్తిగా బయటకు రాకపోవడం, పుష్పాలలో నీరు చేరడం వలన ఫలదీకరణ శక్తి కోల్పోయి తాలు, రంగు మారిన గింజలు ఏర్పడతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ లేదా 1 మీ.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారీ చేయాలి. పాలు పోసుకునే దశలో మూడు రోజులకన్నా ఎక్కువ సమయం పంట నీట మునిగి ఉంటే పిండి పదార్థాలు గింజలలో చేరక గింజ బరువు తగ్గి రంగు మారి దిగుబడి, నాణ్యత తగ్గుతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము లేదా రెండు గ్రాముల కార్బెండిజం మాంకోజెబ్ కలిపి లేదా 1 మీ.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారీ చేయాలి. గింజ గట్టిపడే దశ నుంచి కోత దశలో చేను పడిపోకుండా ఉండి, నిద్రావస్థ కలిగిన రకాలలో నష్టం తక్కువగా ఉంటుంది. నిద్రావస్థ లేనటువంటి బీపీటీ 5,204 వంటి రకాలు నీటమునిగితే గింజ మొలక వచ్చి నష్టం ఎక్కువగా ఉంటుంది.



మెట్ట ప్రాంతంలో వరి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు



బి నాగకుమార్, ఏడీఏ

పోగొట్టుకున్న మంగళ సూత్రాల అందజేత



భక్తురాలికి బంగారు మంగళ సూత్రాలను అందజేస్తున్న గోపీనాథ్

ద్వారకాతిరుమల: శ్రీవారి కేశఖండనశాలలో ఆదివారం ఓ భక్తురాలు పోగొట్టుకున్న కాసు బరువుగల బంగారు మంగళ సూత్రాలను ఆలయ అధికారులు, సిబ్బంది ఆమెకు అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం వెంకటకృష్ణాపురానికి చెందిన ఓ భక్తురాలు శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా క్షేత్రానికి విచ్చేశారు. ముందుగా మొక్కుబడులను తీర్చుకునేందుకు కేశఖండనశాలకు చేరుకున్నారు. అక్కడ స్నానం చేస్తుండగా భక్తురాలి మెడలోని రెండు మంగళ సూత్రాలు పసుపుతాడుతో సహా కిందపడిపోయాయి. అయితే పడిపోయిన విషయం తెలియక ఆ భక్తురాలు అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆ తరువాత స్నానం చేసేందుకు అక్కడికొచ్చిన ఒక భక్తుడికి పసుపు తాడుతో ఉన్న మంగళ సూత్రాలు దొరికాయి. వాటిని ఆ భక్తుడు కేశఖండనశాల కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వాటిని పోగొట్టుకున్న భక్తురాలికి కేశఖండనశాల సూపరింటిండెంట్ గోపీనాథ్, సిబ్బంది అందజేశారు.

జగన్ ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట



తణుకులో శెట్టిబలిజ వనసమారాధనలో భోజనం చేస్తున్న మంత్రి కారుమూరి



అత్తిలిలో మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న యాదవ సంఘ సభ్యులు

తణుకు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఇరగవరం రోడ్డులో ఆదివారం నిర్వహించిన శెట్టిబలిజల కార్తీక వనసమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. శెట్టిబలిజల ఆరాధ్యదైవమైన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలను తణుకు నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం శెట్టిబలిజ సంఘ నాయకులు, సభ్యులతో కలిసి వనసమారాధనలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కుడుపూడి చంద్రరావు, చోడే గోపీకృష్ణ, జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, పిల్లి సూర్యారావు పాల్గొన్నారు.

యాదవుల వనసమారాధనలో సత్కారం

అత్తిలి: కార్తీకమాసంలో వనసమారాధనలు జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అత్తిలి మార్కెట్‌యార్డులో యాదవుల కార్తీక వనసమారాధన జరిపారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ సర్వేశ్వరుడి చూపు ప్రజలందరిపై ఉండాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. అనంతరం మంత్రి కారుమూరిని యాదవ సంఘం తరపున సత్కరించారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, పెద్ద సంఖ్యలో యాదవులు పాల్గొన్నారు.

కాపులకు వైఎస్సార్ సీపీలోనే సముచిత స్థానం



ఎమ్మెల్యే వెంకట్రావును సత్కరిస్తున్న కాపు నేతలు



వనసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల

కాపు వనసమారాధనలో ఎమ్మెల్యేలు తలారి, పుప్పాల

ద్వారకాతిరుమల: కాపులకు వైఎస్సార్ సీపీలోనే సముచిత స్థానం ఉందని గోపాలపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు అన్నారు. ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కాపు కార్తీక వనసమారాధనలో వారు ముఖ్య అతిథులుగా వేరువేరుగా పాల్గొని దామోదర పూజ నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో కాపులనుద్దేశించి ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కాపులకు పెద్దపీట వేశారన్నారు. కాపుల సంక్షేమం కోసం కాపు నేస్తం వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే తలారిని కాపు సంఘ నేతలు ఘనంగా సత్కరించి, శ్రీకృష్ణ దేవరాయుల జ్ఞాపికను అందజేశారు. ఆ తరువాత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు వనసమారాధనను ప్రారంభించి మాట్లాడారు. కాపుల్లో ఐక్యత, రాజకీయ చైతన్యం, సేవాభావాలను పెంపొందించేందుకు వనసమారాధనలు దోహదపడతాయన్నారు. కాపులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఇంకా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం వాసుబాబును కాపు నేతలు సత్కరించారు. కాపునాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిన్నమిల్లి వెంకట్రాయుడు, జిల్లా కార్యదర్శి మాకా శ్రీనివాసరావు, శ్రీవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్, కాపునాడు మండల అధ్యక్షుడు పుప్పాల మురళీ, కాపు కల్యాణ మండప ట్రస్ట్ కార్యదర్శి పాశం రామాంజనేయులు, ట్రస్ట్ సభ్యుడు మైగాపుల మోహన్, అంబటి గాంధీ, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర వెంకట శివాజీ, అచ్యుత ఏసుబాబు, గువ్వల నాగబాబు, చిలుకూరి చంద్రం, చిలుకూరి నాగ, కొల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

వేగివాడలో చోరీ

పెదవేగి: వేగివాడలోని ఓ తోటలో ఉన్న ఇంట్లో ఆదివారం పట్టపగలు చోరీ జరిగి సుమారు ఎనిమిది కాసుల బంగారం, రూ.26 వేల నగదు అపహరణకు గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. తాళ్లగోకవరం అడ్డరోడ్డు సమీపంలో ఏలూరు–జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి పక్కన తోటలో మిద్దే నారాయణ స్వామి అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం వెళ్లగా, నారాయణస్వామి ఇంటికి తాళం వేసి, ఇంటి వెనుక పొలంలో ఉన్న పశువులకు మేత వేయడానికి ఉదయం పదిగంటలు సమయంలో వెళ్లాడు. తిరిగి పదకొండున్నర గంటల సమయంలో ఇంటికి రాగా, తలుపు పగులగొట్టి ఉండడంతో లోనికి వెళ్లిచూడగా బీరువాలో ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలు, రూ.26 వేలు నగదుతోపాటు పట్టు వస్త్రాలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయారు. అంతేకాక సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేసి, రిసీవర్ బాక్సును తీసుకుపోయారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

బిర్యానీలో ఇనుప బోల్టు



ఇనుప బోల్టు

తణుకు: తింటున్న బిర్యానీలో ఇనుప బోల్టు రావడంతో ఆహార ప్రియులు అవాక్కయ్యారు. తణుకులోని జాతీయ రహదారిపై ఇటీవల నూతనంగా ప్రారంభించిన ఒక రెస్టారెంట్‌కు శనివారం రాత్రి కొందరు బిర్యానీ తినేందుకు వెళ్లారు. ఆర్డర్ చేసిన బిర్యానీలో ఇనుప బోల్టు రావడంతో ఖంగుతిన్న వారంతా రెస్టారెంట్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అయితే వారి నుంచి నిర్లక్ష్యపు సమాధానం రావడంతో సోషల్ మీడియాలో పోస్టు చేసి అధికారులకు సమాచారం అందించారు. ఈ నిర్వాకం సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది.


తిరుమల విద్యాసంస్థల అధినేతకు పితృ వియోగం



నున్న చంద్రశేఖర్ రావు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలోని తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు తండ్రి నున్న చంద్రశేఖర్‌రావు (92) శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. చంద్రశేఖర్‌రావుకు ముగ్గురు కుమారులు నున్న తిరుమలరావు, కృష్ణ, సురేష్, కుమార్తె హేమంతపద్మావతి ఉన్నారు. ఆయన వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినా పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దారు. పెద్ద కుమారుడు నున్న తిరుమలరావు తిరుమల విద్యా సంస్థలను స్థాపించి నేడు ఎంతోమందికి విద్యనందిస్తున్నారు. చంద్రశేఖర్‌రావు పార్థివదేహానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పలువురు ప్రముఖులు, తిరుమల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, గ్రామస్తులు నివాళులు అర్పించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు ప్రయోజనం



ప్రదర్శన తిలకించేందుకు వెళ్లిన రైతులు, శాస్త్రవేత్తలు

ఆకివీడు: వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కేవీకే డైరెక్టర్, ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు చెప్పారు. ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ ఆధ్వర్యంలో గుంటూరులో ఈనెల 3, 4, 5 తేదీల్లో జరుగుతున్న అగ్రిటెక్–2023 ప్రదర్శనను తిలకించేందుకు ఉండి కేవీకే ఆధ్వర్యంలో జిల్లా నుంచి 80 మంది రైతులు ఆదివారం రెండు బస్సుల్లో తరలివెళ్లారు. ప్రదర్శనను తిలకించిన అనంతరం చల్లారావు విలేకర్లతో మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనల్ని ప్రభుత్వం రైతులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. కేవీకే కో–ఆర్డినేటర్, సందర్శన యాత్ర ఇన్‌చార్జి ఎస్.మల్లికార్జునరావు మాట్లాడుతూ అగ్రిటెక్ ఏటా నిర్వహించి, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక యంత్రాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ధాన్యం ఆడే మినీ మిల్లులు రైతులకు ఉపయోపడతాయని చెప్పారు. వరి సాగు, కూరగాయల సాగులో ఆర్గానిక్ పద్ధతుల్ని సాంకేతిక పరిజ్ఞాన యాత్రలో తెలియజేశామన్నారు. జిల్లా నుంచి రెండు బస్సుల్లో 80 మంది రైతుల్ని తరలించామని వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ డెబోరా మిస్సియానా, ఎ.రాజేష్, వి.విజయలక్ష్మి, ఎ.శ్రీనివాసరావు, బి.రజిత, రైతులు జట్టు బద్రీనారాయణ, జి.ఏసుబాబు, పి.రంగారావు, రెడ్డి రమణమ్మ, ఆత్మకూరి రమాదేవి, వాటాల సూర్యకుమారి, రైతులు తరలి వెళ్లారు.

క్లుప్తంగా

క్రిస్మస్ శోభ



విద్యుత్ దీపకాంతులతో క్రైస్ట్ లూథరన్ చర్చి

తాడేపల్లిగూడెం రూరల్: డిసెంబరు నెల ప్రారంభమైంది. ఈ క్రమంలోనే క్రీస్తు ప్రార్థనా మందిరాలు రంగు రంగుల విద్యుద్దీప కాంతులతో మిరమిట్లు గొల్పుతున్నాయి. దీంతో ముందుగానే క్రిస్మస్ సంబరాలు ప్రారంభమైనట్లు స్పష్టమవుతుంది. ఇప్పటికే జూబ్లీ రోడ్డులోని క్రైస్ట్ లూథరన్ చర్చి, గాంధీ బొమ్మ సెంటర్, మసీదు రోడ్డులోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వీధిలోనూ, కుంచనపల్లి ఇమ్మానియేల్ చర్చి విద్యుత్ దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ఆయా మందిరాల వద్ద క్రీస్తు జననానికి ప్రతీకగా పశువుల పాకను సిద్ధం చేశారు. ఇప్పటికే ప్రత్యేక ప్రార్థనలను సైతం నిర్వహిస్తున్నారు. ఏదేమైనప్పటికీ, క్రిస్మస్ సంబరాలకు క్రీస్తు మందిరాలు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

గురుకుల విద్యార్థులకు ప్రథమ స్థానం



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజారావు

తాడేపల్లిగూడెం రూరల్ : త్రివేండ్రంలో జరిగిన బ్యాగ్ పైపర్ బ్యాండ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పెద తాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఈ విషయాన్ని ఆదివారం స్కూలు ప్రిన్సిపాల్ బి.రాజారావు ఫోన్ ద్వారా వెల్లడించారు. మొత్తం ఎనిమిది రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. జనవరి 21వ తేదీన జాతీయ స్థాయిలో జరిగే బ్యాగ్ పైపర్ బ్యాండ్ పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా గుంటూరులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి మహేష్ కుమార్, సమగ్ర శిక్ష అడిషనల్ డైరెక్టర్ శిబ్బు, డీఈవో, ఎస్ఎస్‌పీ అధికారులు విద్యార్థులను అభినందించారు.

క్షత్రియ సేవా సమాఖ్య ఆధ్వర్యాన వనసమారాధన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్షత్రియ సేవా సమాఖ్య ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలోని వెంకటపతిరాజు వనంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు సీహెచ్ఆర్‌కే వర్మ, ఉపాధ్యక్షులు పేరిచర్ల మురళీకృష్ణం రాజు, విస్సంరాజు, నరసింహరాజు, రమాకాంత్‌రాజు, దాట్ల జగన్నాథరాజు, అచ్యుత రామరాజు, సాగి సీతారామరాజు, శ్రీనివాసరాజు తదితరులు హాజరయ్యారు. క్షత్రియ మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



పడాల మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్ సూచించారు. ఆదివారం మండలంలోని జగన్నాథపురం, పడాల, పెద తాడేపల్లి, దండగర్ర, ఆరుగొలను గ్రామాల్లో పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఏవో ప్రసాద్ సూచించారు. ఈనెల 4, 5,6,7 తేదీల్లో తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. మండలంలో ఇంకా 197 ఎకరాల్లో వరి కోతలు కోయాల్సి ఉందన్నారు. రాబోయే మూడ్రోజులు కోతలు ఆపాలని హితవు పలికారు. కాగా, పడాల గ్రామంలో ధాన్యాన్ని సంచుల్లోకి పట్టించి, మిల్లులకు తరలించారు. ఆర్బీకే ఇన్‌చార్జులు సన్ని, శివశేఖర్, భరత్ తదితరులు ఉన్నారు.

నేడు పెదపుల్లేరులో ‘వై ఏపీ నీడ్స్ జగన్’

ఉండి: మండలంలోని పెదపుల్లేరులో సోమవారం ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా తరలించుకోవాలి

పెంటపాడు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా రైస్ మిల్లులకు తరలించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన పెంటపాడు మండలం కునాకరపేట ప్రాంతంలో ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న ధాన్యం బస్తాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం తుపాను హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా రైతులు ముందస్తుగా ధాన్యం ఒబ్బిడి చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అమలులో ఉన్న మార్గదర్శకాలకు లోబడి అమ్మకాలు జరుపుకోవాలన్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రైతులు వరికోతలు మరో రెండు రోజులు వాయిదా వేసుకోవాలన్నారు. ధాన్యం తోలకుండా నిల్వ ఉంచే రైతులు పొడిగా ఉండేలా బరకాలు కప్పి జాగ్రత్త చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పంట పొలాల్లో తేమ ఎక్కువగా ఉంటుందన్నారు. కాగా రైతులు అధికారుల సూచనలు పాటించాలన్నారు. జిల్లా యంత్రాంగం దీనిపై అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ విషయంలో రైతులు దిగులు చెందవద్దన్నారు. జేసీ వెంట తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఆర్‌బీకే, వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రైస్ మిల్లులకు తరలిస్తున్న ధాన్యం లోడును పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

రజకులకు సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలి



ప్రదర్శనలో పాల్గొన్న రజక వృత్తిదారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రజకులకు సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలని, రజకవృత్తి చెరువులపై రజకులకే పూర్తి హక్కు కల్పించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం విజ్ఞప్తి చేసింది. తాడేపల్లిగూడెం అపరాల మార్కెట్ వద్ద ఎన్‌కే గ్రౌండ్స్ వద్ద రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడక రాజు అధ్యక్షతన రజక గర్జన సభ జరిగింది. తొలుత పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ రజకులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, రజక మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను నివారించేందుకు రజక చట్టం ఎంతో అవసరమన్నారు. రజక వృత్తిదారులను చైతన్యపరిచి సమస్యల పరిష్కారం పట్ల అవగాహన కల్పించడానికి చైతన్య తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురు శేఖర్ రజక సమస్యలపై మాట్లాడారు. రజక సంఘ నాయకులు నూకరాజు, పసుపులేటి శ్రీనివాస్, కోనేటి రాజు, ఈశ్వరరావు, ఎల్.నిర్మలమ్మ, అంకయ్య, బొజ్జ సుబ్బారావు, పి.శ్రీనివాస్, నరసయ్య, వి.శ్రీనివాస్, యండమూరి నాగేంద్ర, జిల్లా నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

చెస్‌లో బంగారు పతకం



బంగారు పతకం సాధించిన విద్యార్థి నాగసాయి గణేష్

పెంటపాడు: యోగా ద్వారానే ఏకాగ్రత కలిగి చెస్‌లో బంగారు పతకం సాధించినట్లు గూడెంకు చెందిన కె.నాగసాయి గణేష్ తెలిపారు. ఆదివారం యోగా టీచర్ జి.రూప ఆధ్వర్యాన మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో కోడే వెంకట్రావు దగ్గర యోగాసనాలు నేర్చుకున్న తాను ఇటీవల నిర్వహించిన చెస్ పోటీలలో విజయం సాధించి ప్రముఖుల చేతులమీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తాను చదువుకున్న స్కూలు యాజమాన్యానికి, యోగా టీచర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

క్షేత్ర స్థాయిలో సేవాదళ్ సేవలను విస్తరింపజేయాలి



హాజరైన వైఎస్సార్ సీపీ సేవాదళ్ నాయకులు

ఆకివీడు: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ విస్తృత సేవలందించాలని ఉమ్మడి జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ రీజనల్ కో ఆర్డినేటర్ చినమిల్లి వెంకట్రాయుడు పిలుపునిచ్చారు. స్థానిక తాపీమేస్త్రీల సంక్షేమ భవనంలో ఆదివారం మండల సేవాదళ్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే భాగ్యం పార్టీ ద్వారా మనకు దక్కిందన్నారు. ప్రభుత్వ పథకాల్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందకపోతే వారికి లబ్ధి చేకూరే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సేవాదళ్ బ్రిటీష్ కాలం నుంచే ఉందన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, మండల బూత్ కన్వీనర్ అంబటి రమేష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే ఏసు, జిల్లా సేవాదళ్ కార్యదర్శి, మండల సేవాదళ్ అధ్యక్షుడు యర్రా కేశవ, కౌన్సిలర్ తిరుమారెడ్డి మాధవి, ఎండీ మాబూ, తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ జిల్లా వైస్ చైర్మన్‌గా ప్రసాద్



గంగులమూడి ప్రసాద్

పెంటపాడు: జేఏసీ జిల్లా వైస్ చైర్మన్‌గా పెంటపాడుకు చెందిన గంగులమూడి ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈయన జట్లపాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆదివారం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ సమావేశం భీమవరంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏపీ జేఏసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, జట్లపాలెం సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, కమ్యూనిస్టు నాయకుడు కొలింగ లక్ష్మణరావు తదితరులు అభినందనలు తెలిపారు.

ధాన్యాన్ని ఏ రైస్‌మిల్లుకైనా తరలించుకోవచ్చు

జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి

పాలకోడేరు: రైతులు కోసిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా తమకు నచ్చిన రైస్‌మిల్లులకు తరలించుకోవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం పాలకోడేరు మండలం కొరుకొల్లు గ్రామంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో రైతులు తమ సొంత వాహనాలను జీపీఎస్ లేకపోయినా ఉపయోగించుకోవచ్చునని, ఆఫ్ లైన్ ద్వారా కూడా ధాన్యం అమ్మకాలు జరుపుకోవచ్చునని ఆయన తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలోనే మకాం వేయాలని, ఏ రైతుకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎక్కడా ఆరుబయట ధాన్యాన్ని రైతులు ఆరబోసుకోకుండా సురక్షిత ప్రాంతాలలో ఆరబెట్టుకొని వెనువెంటనే రైతు భరోసాల కేంద్రాల ద్వారా రైసు మిల్లర్లకు తరలించాలన్నారు. పుకార్లను, వదంతులను నమ్మవద్దని అధికారులు సూచనలు, సలహాలు పాటించాలని ఆయన కోరారు. జేసీ వెంట తహసీల్దారు షేక్ హుస్సేన్, వ్యవసాయ శాఖ అధికారి నారాయణరావు, రైతు భరోసా కేంద్రం, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

70 శాతం సంక్షేమం ఎస్సీ, ఎస్టీలకే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ఏ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన వాటిలో 70 శాతం నిధులు దళితులకు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అందజేస్తుందని ఏపీ ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు. భీమవరం వ్యవసాయ మార్కెటు కమిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని అన్నారు. అర్హత ప్రమాణికంగా పథకాలను అందిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులకు ఇచ్చిన ప్రాధాన్యత ఇతర ఏ రాష్ట్రంలో ఇవ్వలేదని అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇద్దరు, ముగ్గురు దళితులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని కానీ ఈ ప్రభుత్వంలో నూటికి నూరు శాతం దళితులకు న్యాయం జరిగిందన్నారు. సమావేశంలో భీమవరం ఏఎంసీ వైస్ చైర్మన్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తమైన అధికారులు



ఉప్పలూరులో ట్రాక్టర్లపై ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న తహసీల్దార్, ఏఓ ,ఏడీఏ

ఉండి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఆదివారం కూడా గ్రామ సచివాలయాలు, మండల కార్యాలయాలు యధావిధిగానే పనిచేశాయి. దీనిలో భాగంగా మండలంలోని రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సహకరించేందుకు త్రిసభ్య కమిటీని జిల్లా కలెక్టర్ నియమించినట్లు తహసీల్దార్ వై.శ్రీనివాస్ తెలిపారు. కమిటీలో తహసీల్దార్ వై.శ్రీనివాస్, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో కె.కొండలరావు, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య సభ్యులుగా ఉన్నారు. ఆదివారం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో అధికారులు మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా యండగండి, ఉప్పలూరు, కోలమూరు, చిలుకూరు గ్రామాల్లో అధికారుల బృందం పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి పట్టుబడి అయిన ధాన్యాన్ని ఎటువంటి ఆలస్యం చేయకుండా వివరాలను ఆఫ్‌లైన్‌లోనే నమోదు చేసి సమీపంలో ఉన్న రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేసామన్నారు. గ్రామ సచివాలయాల్లో కూడా అధికారులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఆదివారం కూడా అధికారులు విధుల్లో ఉన్నారన్నారు. కాబట్టి రైతులకు ధాన్యం తరలింపులో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తనకు గాని, ఎంపీడీవోకు గాని, మండల వ్యవసాయాధికారికి గాని ఫోన్ చేసి సమస్య చెబితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకుగానూ తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసామన్నారు. ఇబ్బందులు ఎదురైతే రైతులు వెంటనే 94491041459 నంబర్‌కు గాని 9493742460, 8331056718 నంబర్లలో అధికారులను సంప్రదించాలని సూచించారు. తుఫాన్ హెచ్చరికలతో ఆందోళన చెందకుండా సాధ్యమైనంత త్వరగానే ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. గ్రామాల్లో పర్యటించిన బృందంలో ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ ఉన్నారు.

ముగిసిన ఓట్ల నమోదు

ఆకివీడు: కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ముగిసిందని తహసీల్దార్ విజయలక్ష్మి ఆదివారం చెప్పారు. గత రెండు రోజులుగా ఓట్ల నమోదు, పేర్ల మార్పు వంటి కార్యక్రమాల్ని చేపట్టామన్నారు. మండలంలో మొత్తం 470 ఓట్ల నమోదు, మార్పులు, చేర్పులు జరిగినట్లు తెలిపారు.

పేద వర్గాలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు

తాడేపల్లిగూడెం రూరల్: పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండాలని కేంద్రంలోని మోదీ సర్కారు పథకాలను అమలు చేస్తోందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. మండలంలోని మాధవరం, ఉప్పరగూడెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కో కన్వీనర్ రామగాని సత్యనారాయణ, వీఆర్‌వీఎల్ నారాయణ, వన్నెంరెడ్డి నవీన్, రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, గంధం రామకృష్ణ, వేంపల్లి మంగరాజు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

భీమవరం అర్బన్: తుపాను నేపథ్యంలో రొయ్య, చేపల రైతులు ఎప్పటికప్పుడు తమ చెరువులను పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్ఎల్ఎన్ రాజు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను కారణంగా ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగవచ్చని జనరేటర్లు, డిజిల్ ఆటో ఇంజిన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాలు కురిసి ఆకాశం మేఘావృతమై ఉండటంతో చెరువులో ఆక్సిజన్ శాతం తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయని, ఆక్సిజన్ ట్యాబ్లెట్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంతేకాక భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున చెరువును పూర్తిస్థాయిలో నీటి మట్టంతో నింపకుండా రెండు అడుగుల మేర నీటిని తగ్గించాలన్నారు.

అలరించిన హరికథ



హరికథ చెబుతున్న సింహాచల శాస్త్రి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ద్వితీయ హరికథా సప్తాహం లో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మినగర్ రోడ్డు నెంబర్ 4లో పురపాలక సంఘ మాజీ సభ్యుడు కర్రి ప్రభాకర్ బాలాజీ నివాసం వద్ద ఆదివారం రాత్రి తొలుత అన్నమయ్య కీర్తనలు, అనంతరం గుంటూరు వాస్తవ్యులు ముప్పవరపు సింహాచల శాస్త్రి భాగవతార్‌చే శంకర విజయం హరికథ వైభవంగా నిర్వహించారు. మృదంగంపై సరస్వతుల హనుమంతరావు, వయోలిన్‌పై వీరా శివ ప్రసాద్ సహకరించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు తదితరులు హాజరయ్యారు.

దానేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి విరాళం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేంచేసి యున్న శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన కాపకాయల మోహన్‌సాయి నారాయణ రూ.21 వేలు విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ విరాళానికి సంబంధించిన చెక్కును అందజేసినట్లు తెలిపారు.

దివ్యాంగుల కార్తీక వనసమారాధన



భోజనం అందిస్తున్న సతీష్ బొల్లా, కాన్‌రాజ్

తణుకు అర్బన్: దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తణుకు జెడ్పీ హైస్కూలు ఆవరణలో ఆదివారం తణుకు దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు వేంద్ర లక్ష్మణ్ ఆధ్వర్యాన కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ ఫౌండేషన్ అధ్యక్షుడు సతీష్ బొల్లా మాట్లాడుతూ దివ్యాంగులు స్వశక్తితో జీవనం సాగిస్తుండటం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా కులాల వారీగా కార్తీక వనసమారాధన నిర్వహించుకుంటున్న నేటి రోజుల్లో దివ్యాంగులంతా ఒక్కటిగా కార్తీక వనసమారాధన చేసుకోవడం మంచి పరిణామమన్నారు. ఫౌండేషన్ తరఫున దాతల సహకారంతో దివ్యాంగులకు వసతులు కల్పిస్తున్నామని, సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు ముందుకు వచ్చిన వారికి త్వరలోనే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జయంతి జ్యూయలర్స్ అధినేత వజావత్ కాన్‌రాజ్, తుమ్మలపల్లి సుబ్బారావు, గమిని రాజా, మానేపల్లి కాశీ, సింహాద్రి కాశీ, శర్మిష్ఠ వీరన్న, గమిని మహిపాల్, సింహాద్రి సతీష్, శర్మిష్ఠ దీపక్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జిల్లా స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) కార్యవర్గం

తణుకు: ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం తణుకులో ఎన్నుకున్నారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి హాజరయ్యారు. జిల్లా గౌరవ అధ్యక్షునిగా ఎ.నాగార్జున(పెద్దతాడేపల్లి), అధ్యక్షునిగా ఎస్ఆర్ అప్పారావు(రేలంగి), ప్రధాన కార్యదర్శిగా వేదాల ఉదయ్(పాలకొల్లు), కోశాధికారిగా చొప్పర సుందర్‌కుమార్ (పాలకోడేరు), నిర్వహణ కార్యదర్శిగా కోమర్తి శ్రీనివాసు (తేతలి), ఉపాధ్యక్షులుగా కట్టా వెంకటేశ్వరరావు, (జగన్నాధపురం), బడుగు చంద్రశేఖర్ (పెద్దతాడేపల్లి), సహాయ కార్యదర్శిగా చలమల ప్రసాద్(పైడిపర్రు), మహిళా కార్యదర్శిగా వి.సుమలత (రేలంగి), రాష్ట్రప్రతినిధిగా జి.రవి (కొమరవరం) ఎన్నికయ్యారు. 2023-24, 2024-25 సంవత్సరాలకుగానూ ఈ కమిటీను ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించిన కృష్ణా జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సుధాకర్ తెలిపారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీడీ రవిబాబు, రాష్ట్ర అసోసియేట్ సభ్యులు సీహెచ్ రమేష్, కోశాధికారి కె.దుర్గాప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే కరిముల్లా బాషా, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హడావుడిగా మాసూళ్లు

కాళ్ల: తుపాను గండం వరి రైతుల గుండెల్లో గుబులు పుట్టించింది. ఆదివారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉండడంతో ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పంటను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. హడావుడిగా కోత మెషీన్లతో వరి కోతలు కోస్తున్నారు. కోసిన ధాన్యాన్ని ఆరబెడుతూ పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో సుమారు 3,800 ఎకరాల్లో సార్వా సాగు చేశారు. ఇప్పటి వరకు 558 ఎకరాల్లో మాసూళ్ళు పూర్తయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే మండలంలో వేంపాడు, కోపల్లె, జక్కరం, బొండాడ, సీసలి, కాళ్ళ, కాళ్ళకూరు తదితర గ్రామాల్లో సార్వా మాసూళ్ళు ప్రారంభమయ్యాయని తెలిపారు. వాతావరణం అనుకూలించి మరో కొన్ని రోజులు వర్షాలు పడకుండా ఉంటే సార్వా పంటను కాపాడుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు.

తుపాను పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఎంఏ అంబరీష్

నరసాపురం: తుపాను ప్రభావిత పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆర్డీవో తన ఛాంబర్‌లో బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుఫాన్ కారణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెవెన్యూ, పోలీస్, ఆరోగ్యశాఖ, పీఆర్, విద్యుత్, ఇరిగేషన్, డ్రైయినేజీ, మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ముఖ్యంగా తుఫాన్ నేపథ్యంలో ముందుగా తీరప్రాంత వాసులను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే తుఫాన్ తీవ్రత తగ్గే వరకూ పేరుపాలెం బీచ్‌కు ఎట్టి పరిస్థితుల్లోను సందర్శకులను అనుమతించవద్దని ఆర్డీఓ పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వాకపల్లి ప్రసాద్, తహసీల్దార్లు ఎండీ ఫాజిల్, జి.అనితకుమారి, ఎంపీడీఓలు వీకే వీరభద్రరావు, యు.బాబ్జీరాజు, మత్స్యశాఖ ఇన్‌చార్జ్ ఏడీ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెనుగొండ: మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని నర్సాపురం సబ్ కలెక్టర్ ఎంఏ అంబరీష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం పెనుగొండ మండలంలో వడలి, ఇతర గ్రామాల్లో పర్యటించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని జీపీఎస్ వాహనాల ద్వారా రైసుమిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎన్.గురుమూర్తి రెడ్డి, వ్యవసాయాధికారి పి.స్పందన ఉన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: తీవ్ర తుఫాన్ కారణంగా భారీవర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని నర్సాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ స్థానిక అధికారులను ఆదేశించారు. ఆదివారం పెనుమంట్ర మండలంలోని ఆలమూరు, వెలగలేరు, గ్రామాలలో పర్యటించి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆలమూరులోని ఒక రైస్ మిల్లును తనిఖీ చేసి యజమానికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ డీవీ అశోక్‌వర్మ, ఎంపీడీఓ పద్మజ, వ్యవసాయ అధికారిణి అంగర జ్యోత్స్న, ఏఈఓ సత్యనారాయణ ఉన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: తుఫాన్ కారణంగా సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న గ్రామాలైన పెదమైనవాని లంక, చినలంక, వేములదీవి తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ పర్యటించారు. గ్రామాల్లోని ప్రజలతో ఆయన మాట్లాడారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. నరసాపురం తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్ పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హోమం



గణపతి హోమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధిలో ఉన్న రామాలయంలో అయ్యప్ప స్వాములు గణపతి హోమం నిర్వహించారు. ఆదివారం వేకువజామున మారుతి స్వామి పీఠం ఆధ్వర్యంలో సుమారు 40 మంది అయ్యప్ప స్వాములు గణపతి హోమంలో పాల్గొన్నారు. కడియాల శ్రీనివాసు బ్రహ్మత్వంలో హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 35వ పర్యాయం మాల ధరించి స్వామివారి సన్నిధికి వెళుతున్నట్లు మారుతి స్వామి తెలిపారు. హోమం అనంతరం స్వాములకు ఇరుముళ్లు కట్టి సాయంత్రం శబరిమల పయనమయ్యారు. తుఫాన్ కారణంగా రైళ్లు రద్దు కావడంతో బస్‌లో శబరిమలై వెళుతున్నట్లు స్వాములు తెలిపారు.